పంచకళ్యాణి

శ్రీ సూరి

ఒకనాడు మధ్యాహ్నం పాడుపడిపోయిన ఒక జట్కా స్టాండుదగ్గర హఠాత్తుగా ఓ తెల్లగుర్రం కన్పించింది. పాలనురుగులా తెల్లగావున్న దాని శరీరంమీద యెక్కడా రవంతమచ్చ అయినాలేదు మెత్తగా పట్టుకుచ్చులా ఉన్న దానితోక అందంగా సూర్యకాంతిలో ధగధగా మెరుస్తోంది.

దారితప్పి వచ్చిన బాటసారిలాగా ఉన్న దాగుర్రం. దాన్ని ఇంతకుపూర్వం ఈపరిసరాల్లో ఎవ్వరూ చూసిఎరుగరు. తన యజమాని దగ్గరనుంచీ, ఇంటి మంచీ తప్పించుకుని తిరిగి తిరిగి చివరకు ఇక్కడకు చేరుకుంది అది. విపరీతమైన ఆకలితో నకనకలాడిపోతూ నేలను వాసనచూసింది. దానినిట్టూర్పుతో రోడ్డుమీద ధూళి గప్పున పైకిరేగింది. పాపం! తినేందుకేమీ దొరకలా దానికి. దుర్వాసన కొడుతున్న అక్కడున్న చెత్తకుప్పను మూచూసి, విసుగుతో వెనక్కితిరిగింది.

కిటికీలోంచి ఇదంతా చూస్తున్న శీల తల్లి - "పాపం! బహుశా ఎన్నాళ్ళనుంచో తినటానికి దానికి ఏమీదొరికి ఉండదు. యజమాని వద్దనుంచి తప్పించుకు వచ్చివుంటుంది" అన్నది. కొత్తగా పెళ్ళి అయిన శీల తల్లి పక్కనే నుంచుని ఉంది. "అతడ్ని ఎవరో చంపిఉంటారు," అంది.

"ఏమిటే?"అని ఆశ్చర్యంతో శీల తల్లి తెల్లబోయింది. ఈ మధ్యకొన్నాళ్ళ నుంచీ ఎక్కడా ఎవరూ చచ్చినట్లు ఆమెవినలేదు. కాని అక్కడక్కడా కొన్ని దురంతాలు జరుగుతున్నట్లు మాత్రం విన్నది. ఎన్నెన్నో హత్యలను గురించీ, రాక్షసకృత్యాలను గురించీ చాలా కధలుకూడా విన్నది.

ఆ గాధలు వింటుంటే అసహ్యంతో కొందరికి శరీరం గగుర్పొడుస్తుంది. కొంతమందికి ఆకలిదప్పులూ, నిద్రా కూడా ఉండవు. అయినా మానవుడంత పశువులా ప్రవర్తిస్తాడన్నది ఆమె నమ్మలేకపోయింది;

"బహుశా అతడు బ్రతికేఉండొచ్చు" అన్నదామె.

మతకలహాలతో పాడుపడినట్లున్న ఈ పరిసరాలకు ఈ తెల్ల గుర్రం రావటం - ఏదో కొత్తజీవం, కళ తీసుకువచ్చినట్లుంది. కుర్రవాళ్ళంతాఎంతో ఉత్సాహపడసాగారు.

వాళ్ళలో మరీచిన్నవాళ్ళు దూరంగా నుంచుని ఆనందించసాగారు. కొంచెం పెద్దవాళ్ళు దగ్గిరకువచ్చి దాన్ని చేతులతో దువ్వి నిమరటం మొదలెట్టారు. వాళ్ళు అలా తమ మెత్తటి చేతులతో నిమురుతూంటే ఆ గుర్రం సంతోషంతో సకిలించసాగింది.

వాళ్ళకు ఈ గుర్రం రకరకాల ఆలో

చనలను కలిగించసాగింది. వారిలో చాలామంది ఈ గుర్రం, ఏ జమీందారుదో, ఏ శ్రీమంతుడిదో అయిఉంటుందనే నిశ్చయానికి వచ్చారు. అయితే భాగ్యవంతుల గుర్రాలు ఏం తింటాయి: అని ఆహార విషయికమైన ప్రశ్న వచ్చిందప్పుడు. "నీకు తెలుసా ? అవి వైను తాగుతాయి, విదేశాలనుంచివచ్చిన వైను." అన్నాడొకడు.

"అవి వైనుత్రాగకపోతేమరి అంత బలిష్ఠంగా ఎందుకుంటాయి ?" అని నందా వ్యాఖ్యానించాడు. ఇంతలో మరో కుర్రాడికి ఆలోచన రేగింది " ఇది బహుశా ఏ విరిగిపోయిన బండి గుర్రమో అయిఉంటుం"దన్నాడతడు.

నవ్వుల కోలాహలం ఎక్కువయింది. "ఎంతో పెద్ద పెద్ద గుర్రాలను చూసి ఉంటావు నువ్వు" అన్నాడు నందా.

ఈచర్చలు ఇలా సాగుతుండగానే యమునప్రసాద్ ఒక తాడు తీసుకొచ్చి దానికి కళ్లెంలాగా అమర్చాడు. అతడి చేతిలో ఒకచిన్న పేముబెత్తం కూడా ఉంది.

యమునప్రసాద్‌కు షుమారు ఇరవై ఏళ్ళు పైనఉంటాయి. నల్లగా పొట్టిగా ఉంటాడు. చిన్నధోవతిఒకటి కట్టుకుని బనీనువేసుకున్నాడు. సినిమా టిక్కెట్లు ముందుగానేకొని. సినిమా ప్రారంభించే సమయానికి వాటిని మామూలురేట్లకన్న ఎక్కువ రేట్లకు అమ్మి డబ్బు సంపాయిస్తూఉండటం అతడివృత్తి. అతడుజూదమాడుటలో కూడా నేర్పరి. 'పేవ్‌మెంట్సు'మీద కూర్చుని తన సంపాదనలో చాలాభాగం జూదమాడి పోగొట్టుకుంటూ ఉంటాడు. జూదంలో పోగా మిగిలిన డబ్బుతో చవకరకం సారాయి మొదలైనవి త్రాగి, అసహ్యంగా ప్రవర్తిస్తూ ఉంటాడు.

ఈ మతకలహాలు జరుగుతున్నప్పుడతడొక ప్రసిద్ధవ్యక్తిఅయినాడు. దగ్గరలో ఉన్న దేవాలయాల మీద ఎక్కడైనా దాడి జరిగిందంటే అక్కడ మొట్టమొదట విన్పించే గొంతుక మన యమునప్రసాద్‌దే....

మిలిటరీలోనుంచి తిరిగివచ్చిన వాళ్ళకు టీ, సిగరెట్లూ సప్లయిచేస్తూ అతడు కొంతమందిని స్నేహంచేసుకున్నాడు. ఈ కుర్రవాళ్ళంతా అతడిని 'మిలిటరీ కాంటీన్' అని హేళనచేస్తూ ఉంటారు.

ఈరెండురోజులనుంచీ అతడికి దేనికీ తీరిక చిక్కటంలేదు. అతను రోజంతా ఈ గుర్రపు స్వారీలోనే గడుపుతున్నాడు.

"నేను సార్జంటునయినాను" అని కోతలు కోశాడు. కొంతమంది కుర్రాళ్లు అతడివెంట పరుగెత్తారు. ఒకళ్ళిద్దరు "దిగిరా యమునా ! మమ్మల్నికూడా కాస్త గుర్రం ఎక్కనిద్దూ?" అని అడిగారు. యమున సమాధానం ఇవ్వనూలేదు, ఇవ్వతలచుకోనూలేదు. అతడు వారిని లక్ష్యపెట్టలేదు. టక్‌టక్‌మని గుర్రాన్ని పోనిచ్చాడు.

"ఇదేమిటి ? నువ్వేమో గుర్రమెక్కి స్వారి చేస్తూంటే మేము చూస్తూనుంచోమా ? ఇహ ఇది సాగదు" అన్నాడు నకుల్,

"ఈవీధిచివరఉన్న దుకాణానికివెళ్ళి

నాకు ఒకకిళ్ళీ - కాసిని సిగరెట్లూ తెచ్చి పెట్టు. తర్వాత ఎక్కుదువుగాని గుర్రం" అన్నాడు యమున.

"డబ్బులేవీ ?"

"ఓ నా పేరు చెపుదూ ! యమున ప్రసాద్ కావాలంటున్నాడని చెప్పు."

నకుల్ వెళ్ళి కాస్సేపట్లో తిరిగివచ్చి "అతడు ఇవ్వడుట ! ముందు డబ్బు కావాలంటున్నాడు" అని చెప్పాడు.

"దొంగముండా కొడుకు ! వాడి దుకాణం కాపాడాను నేను. జూదంలో మాత్రం నా దగ్గిర ఎంత డబ్బు కాజేయ లేదువాడు ? ఇప్పుడు వెధవ కిళ్ళీకోసం అర్ధణాడబ్బులు కావాలంటున్నాడు" అని యమునప్రసాద్ షాపుదగ్గిరకే పోనిచ్చాడు గుర్రాన్ని. నకుల్‌కి గుర్రం ఎక్కేందుకు అవకాశం రానేలేదు.

దసరా పండగలు వస్తున్నాయి. సాధారణంగా ఈ రోజుల్లో కుర్రాళ్ళంతా గడ్డిబొమ్మలుచేసే వాళ్ళచుట్టూమూగుతూ ఉండేవాళ్ళు. ఆ మన్ను అంతా రాళ్ళూ అవీలేకుండా మెత్తగా చేశాక ఆబొమ్మకు పూస్తారు బొమ్మలు చేసే వాళ్ళు. ఆ బొమ్మలు చేసేవాళ్ళ దగ్గిర కూర్చుని, వాళ్ళకి అవీ ఇవీ అందిస్తూ సహాయ పడటం ఈ కుర్రవాళ్ళకు మహాసరదా.

ఈ సంవత్సరం మత విషయికమైన పూజలకు ఉపయోగపడే ఈ బొమ్మలు చేయటం ఇంకా ప్రారంభం కాలేదు. అంచేత ఈకుర్రాళ్ళు తమసమయమంతా ఈ గుర్రం దగ్గిరే గడుపుతున్నారు. వాళ్ళు ఆ గుర్రానికి 'చాంద్' అని పేరెట్టారు.

గుర్రం అంతహుషారుగా లేదు. తెల్లగా ధగధగలాడే దానిశరీరం కొంచెం కాంతి తగ్గింది. కాళ్ళు ఈడ్చుకుంటూ నడుస్తున్నట్లుండేది. వెనకవైపున ఎడమ కాలికి గాయంతగిలింది. దానికి చీము కూడా పట్టింది.

శీలతండ్రి హృషీకేశబాబు స్థానికంగా ఉండే పెద్దలలో ఒకరు. పిల్లలంతా కూడా ఆయన్ని గౌరవిస్తూ ఉంటారు. "నువ్వు గుర్రానికేమైనా ఆహారం పెడుతున్నావా ?" అని నకుల్‌ని అడిగాడాయన.

"నందా ఆహారం పెడుతూ వుంటాడు." అన్నాడు నకుల్. నందాని అడిగితే, "అదేమో నాకు తెలియదు. ఆసంగతి యమునప్రసాద్‌ను అడిగితే అతడు చెప్పగలుగుతాడు" అన్నాడు.

ఈసంగతులన్నీ శీలతల్లి భర్తవల్ల విని తనకొడుకు సంతును గుర్రానికి మేత-పొట్టు కొనుక్కురావటానికి బజారుకు పంపింది. చాంద్ ఆతెచ్చిన ఆహారాన్ని కాస్త మూచూచి మిగిలింది వదిలేసింది.

సంతుస్నేహితుడు ఖోకాన్ "ఆ ఆహారం మరీ ఎండిపోయి వుంది. అంచేత బహుశా చాంద్‌గొంతులో గుచ్చుకుని ఉంటుంది. దానికి కాసిని నీళ్ళుతెచ్చి పడదాం" అన్నాడు.

వాళ్ళిద్దరూ వెళ్ళి నీళ్ళు పట్టుకు వచ్చారు. వాళ్ల నీళ్లుతెచ్చిన పాత్రల్లో ఒకటి మరీచిన్నది. రెండోదిచిల్లిది. అంచేతపాపం ! ఆ గుర్రానికి త్రాగటానికి నీళ్ళయినా లేకపోయినాయి.

చేతుల్లో ఏమీలేకుండా ఆ కుర్రాళ్ళు కొంతమంది దగ్గిరున్న 'టీ' షాపుకు

వెళ్ళి, పగిలిపోయిన సాసరుతో కాస్త టీ తీసుకువచ్చారు.

"ఇలావచ్చి కాస్త టీ తాగు చాంద్! గోకుల్ యిచ్చిన టీ ఎంతో బావుంటుంది. కాస్త రుచిచూడు" అని మచ్చిక చెయ్యటం మొదలెట్టారు.

కాని గోకుల్ టీ లో ఉన్న సుగుణాలు చాంద్‌ను ఆకర్షించలేక పోయాయి. అది ఒకటి రెండుసార్లు వాసనచూసి చివరకిహ ముఖం అవతలకు తిప్పుకుంది.

ఆ గుర్రం స్థితి మరీ దిగజారిపో సాగింది. ఇప్పుడు దానంతటది కదల టమే కష్టంగావుంది. కాని యమున మాత్రం మామూలుగా స్వారీచేస్తూనే ఉన్నాడు. "ఆ గుర్రానికి కాస్త విశ్రాంతి తీసుకోనీ యమున్! నువ్వదాన్ని చంపేట్టుగా ఉన్నావు" అన్నాడు హృషీకేశబాబు.

యమున తప్పతాగి ఉన్నాడు. వచ్చీ రాని హిందీ, బెంగాలీ కలిపి అతడు వాగినదాని సారంశం ఏమిటంటే– "వేల కొలది మనుష్యులే చచ్చిపోతుండగా లేవిది. అందరూ ఎక్కి స్వారిచేసే గుర్రాన్ని గురించి మీకింతదిగులెందుకు" అని పకపకా వికృతంగా నవ్వాడు. ఆ నవ్వు పదునైన కత్తిపెట్టి కోసినట్లుంది.

ఆ సాయంత్రం కొంతమంది కుర్ర వాళ్ళ సహాయంతో హృషీకేశబాబు ఆగుర్రాన్ని ఖాళీగాఉన్న ఒక గుర్రపుశాల లోకి చేర్చాడు. దాని ముందర కాసిని నీళ్ళు, కాస్తగడ్డి తీసుకువెళ్ళి ఉంచాడు.

వాళ్ళు దాన్ని అక్కడకు తీసుకు వచ్చి రావటంతోనే శాంతిరక్షకభటులు 'లోపలికి వెళ్ళండి - లోపలికి వెళ్ళండి' అని కేకలు వేసుకుంటూ వచ్చారు ట్రక్కుల్లో.

మర్నాడు ఉదయం చూసేసరికి ఆ గుర్రపుశాల తాళం వేసివుంది. ఆనీళ్ళ తొట్టి బైటనే ఉంది. దాని ప్రక్కనే గుర్రం నిర్జీవంగా ఏదో ఒక మాంసం ముద్దలా నిలబడి ఉంది. దాని కళ్ళు మిలమిల మెరుస్తూనే ఉన్నాయి. కాని వాటిల్లో ఏ భావమూ వ్యక్తంకావటంలా. అది తనమీద వాలిన ఈగలను తోకతో తోలుకునేటంత ఓపికకూడా లేకుండా వుంది

సంతు దానికోసం కాసిని గుగ్గిళ్ళు తీసుకువచ్చాడు. కాని చాంద్ వాటిని వాసనైనా చూడలా.

"అవి నాచేతికియ్యి సంతూ! నాచేత్తో పెడితే తింటుందేమో చూద్దాం. నేను ఇదివరకు చాలా గుర్రాలకు ఆహారం పెట్టేవాణ్ణి. నీకు తెలిసే ఉంటుంది. మునుపు మాకో గుర్రపుబండీ కూడా ఉండేది" అన్నాడు నందూ.

ఏమయినా ఆ మూగ జంతువు కద ల్లేదు. మెదల్లేదు. ఆ కుర్రాడు తన విశ్వాసాన్ని కోల్పోయాడు. "దీని జబ్బేమిటో చాలా ప్రమాదంగా ఉందిల్లే ఉంది."

అప్పుడు పదిగంటలయి ఉంటుంది. సూర్యకాంతి తీక్ష్ణంగా కొరడాతో కొడు తున్నట్లు చురచురలాడుతోంది. చాంద్ విశ్రాంతిలేక బాధపడుతోంది. ఆ కుర్ర వాళ్ళు మెల్లిగాదాన్ని బాల్కనీ నీడ దగ్గ రకు నడిపించారు.

"తెల్లగుర్రాలు ఎండలో నిలబడ లేవు. అంతే. అంతకన్న దాన్నిగురించి

భయపడాల్సింది ఏమీ లేదు" అని నంద్ ధైర్యం చెప్పాడు.

ఈ సమయానికి ఒక ముసలివ్యక్తి మెయిన్ రోడ్డుచివర కన్పించాడు. అతడు నలువైపులా ఒకసారి తేరి పార చూసి ఆ సందులో ప్రవేశించాడు అతడి ముఖం ముడతలు పడివుంది. మీసాలు, గడ్డం నెరిసిపోయి ఉన్నాయి ఒక మురికి లుంగీకట్టుకుని కుచ్చుటోపీ ఒకటి పెట్టుకుని ఉన్నాడు.

అతడి చేతిలో ఒక చీనారేకు బాల్చీ ఉంది. అది సూర్యకాంతిలో ధగ ధగ లాడుతోంది.

అతడ్ని ఎప్పుడు ఎక్కడ చూసినా గుర్తుంచుకోతగినట్లు ఉంటాడు కాని ఈ రోజుల్లో ఈ పరిసరాలకు రావటం వల్ల ఒక విధమయిన సంచలనం కలిగించాడు "చచ్చాం బాబోయ్! ఈ సమయంలో ఇతడిక్కడికి ఎందుకు వచ్చాడు?" అని గొణుక్కున్నాడు హృషీకేశబాబు.

ఆ ముసలివాడికి ఈ గొడవంతా పట్టటమేలేదు. అతడు దేనికోసమో వెతుకుతున్నట్లుంది. అతడు తన తీక్ష్ణమైన దృష్టులను వీధిఅంతా ప్రసరింప చేస్తున్నాడు.

కాస్సేపటికి అతడిదృష్టి గుర్రంమీద పడగానే అతడికళ్ళు సంతోషంతో మెరిశాయి. అతడు గుర్రందగ్గిరకు ఎగిరి గంతేసి, దాన్ని చేత్తో నిమురుతూ, "అయ్యో సొహరబ్, ఇదేమిటి ఇలా ఉన్నావిక్కడ?" అనుకున్నాడుతనలో, సుపరిచితమైన ఆస్పర్శతో గుర్రానికి శరీరం గగుర్పొడిచింది. నేత్రాల్ని విప్పార్చి, మనుష్యులు చూచినట్లు ఎంతో అర్థవంతంగా-చెప్పవలసిందెంతో ఉన్నదన్నట్లు చూడసాగింది. బహుశా అది మాట్లాడటం నేర్చిఉన్నా, ఇంతకన్న ఎక్కువగా తనకు తెలియచేసుకోకలిగేది కాదేమో!

బుధూ వచ్చీరాని హిందీలో "దాని పేరు సొహరబా? మేం చాంద్ అని పిలుస్తున్నాం" అన్నాడు.

"ఓ! ఏదయినా ఒకటే" అన్నాడు ఆముసలి.

"ఈగుర్రంనీదా?" అని అడిగాడు నందు.

"కాదుబాబూ! నేను ఈ గుర్రపువాణ్ణి. బండికూడా తోలుతానునేను."

"అయితే ఈగుర్రంనీదేఅన్నమాట" అన్నాడు నందు.

"ఠీక్ హై" అని ముసలివాడు నవ్వాడు

గబగబా పంపుదగ్గరకు వెళ్ళి బాల్చీ నిండా నీళ్ళు పట్టుకువచ్చి గుర్రం ముందర పెట్టాడు అది ఒక్కచుక్క అయినా మిగల్చకుండా త్రాగేసిందినీళ్లు. 'జైహింద్' అని చప్పట్లు చరచారు కుర్రాళ్ళు.

అతడు బొడ్లోపెట్టుకు తీసుకువచ్చిన గుగ్గిళ్ళపొట్లం తీసి, ఆ గుర్రంచేత తినిపించాడు. అవి కాసినీ ఆ గుర్రం తినెయ్యటం పూర్తిగాగానే "బాబూ, మీరింకా కాసిని గుగ్గిళ్ళు తీసుకురాగలరా?" అని కుర్రాళ్ళను అడిగాడు.

"ఓ! తప్పకుండా" అని నందా పరుగుతీశాడు. అతడివెంట నకుల్, గాబా అందరూ వెళ్ళారు. అంతాకలిసి

నాలుగు పొట్లాల గుగ్గిళ్ళు తీసుకు వచ్చారు.

ఆ గుర్రానికి కొంచెం కడుపునిండాక "సొహరబ్బుకు జబ్బుచేస్తే అది నా ఒక్కడిచేతిమీదుగా ఇచ్చిన ఆహారాన్ని మాత్రమే తీసుకుంటుంది." అన్నడా ముసలివాడు.

అతడికి పూర్వపు సంగతులన్నీ గుర్తుకు రాసాగాయి. సొహరబ్ పరుగెత్తేప్పుడుండే తీవీ అదీ చూసినప్పుడు ప్రజలు "ఈ పందెపు గుర్రాన్ని బండి లాగటానికి ఉపయోగిస్తావేం?" అని అడుగుతూ ఉండేవారు.

అతడు నుదురుమీద కొట్టుకుని, "మనుష్యులకులాగానే గుర్రాలకు కూడా ఖర్మఅనేది ఒకటుంది," అని సమాధానమిచ్చేవాడు.

కాని అవన్నీ చాలారోజుల క్రిందటి మాటలు. ఇప్పుడో? తర్వాత కాస్సేపాగి, "ఎప్పుడుదీనికి నయమవుతుంది? ఎప్పుడు దీన్నినేను బండి కడతాను? రోడ్లమీద స్వేచ్ఛగా తిరగటానికి ఈ భయం, కలహాలు లేకుండా ఎప్పుడు పోతాయి?" అని అడిగాడు హృషీకేశ బాబును.

పాపం! అతడు ప్రశాంతంగాఉండే పూర్వపు రోజుల్ని గురించి ఆలోచిస్తున్నాడు. ఏంచెప్పాలో హృషీకేశ్‌కు తోచలేదు.

హఠాత్తుగా రాక్షసి మేల్కొన్నట్లయింది. ఆరాక్షసి నాల్గువైపులా చేతులు చాచి వికటాట్టహాసం చేస్తున్నట్లుంది. తుపానులాగా వార్తలు చెలరేగుతున్నాయి. లాల్‌పట్టీలో మతకలహాలు ప్రారంభమైనాయి.

మెయిన్ రోడ్డుమీదినుంచి ఒక జన ప్రవాహం - ఒక మహానదిలో దూసుక వచ్చి ప్రవాహంకాలువలోకి పాకినట్లు-ఈ వీధిలోకి జొరబడుతూంది. జనంఎక్కడివాళ్ళక్కడ చెల్లాచెదరయినారు. 'చంపండి, చంపండి' అని ధ్వనులు ప్రతిధ్వనిస్తున్నాయి.

అ ముసలివాడు విరాళా దృష్టులతో చుట్టూ చూడసాగాడు. ఆ పిల్లవాళ్ళ ముఖాలకేసి జూశాడు. సొహరబ్ కళ్ళు మిలమిల లాడాయి. ఆ చూపులెంతో జాలిగా ఉన్నాయి. ఆ గుర్రంకూడా తన యజమానికి రానున్నప్రమాదంగ్రహించినట్లుంది.

"నువ్వేం భయపడాల్సిన అగత్యం లేదు." అని ఆ ముసలివాడికి నందు ధైర్యం చెప్పాడు.

అపరిచితులైన ఎన్నో వందల నేత్రాల ముందర, అతడు వణికిపోతూ అంత ధైర్యాన్ని పొందలేకపోయాడు.

ఒకగుంపు అతడివైపుగా ముందుకు రా సాగింది. యమున, నకుల్, నంద మిగిలినవాళ్ళూ ఆ ముసలివాని చుట్టూ మూగారు. హృషీకేశ్ అజనాన్ని కొంత పరచాలని ప్రయత్నించి, "ఇతడు అమాయకుడు. చంపకండి ఇతణ్ణి" అన్నాడు.

ఆ జన సమూహంలోనుంచి అతడి మాటలను వ్యతిరేకిస్తున్న ధ్వనులు రాసాగాయి. "వీళ్ళు మనుష్యులుకాదు. రాక్షసులు."

"మిటియా మ్మతి నువ్వు అప్పుడే మరచిపోయావా?"

"ప్రాణానికి ప్రాణమే"

"వాళ్లు ఎన్ని ప్రదేశాలలో మనవాళ్ళని కాపాడారో తెలుసా నీకు ? " అని ప్రశ్నించాడు హృషీకేష్. "మేమూ కాపాడాం చాలామంది ప్రాణాల్ని. అనవసరపు వాగుడుకట్టిపెట్టు."

వాళ్ళని ఒప్పించటానికి ప్రయత్నించటం నిష్ప్రయోజనం. వాళ్ళతో వాదించటం వల్ల ప్రయోజనం లేకపోవటమే కాకుండా ప్రమాదంకూడా కద్దు.

"ఊరుకో కాకాబాబు!" అన్నారు యమున, నందా. అని ఇద్దరూ ధైర్యంగా ముందుకు వచ్చారు.

"పోట్లాటకు వచ్చేవారు ఎవరో ముందుకురండి!"అనిఅరచాడుయమున్.

ఆగుంపువెనక్కి తగ్గి ఆశ్చర్యంతో కొయ్యబారి పోయారు. కాని కాస్సేపు అయాక మళ్ళీక్రోధపు ధ్వనులు చెలరేగాయి. ఆ కుర్రవాళ్ళ మీద కొన్ని రాళ్ళు విసిరారు.

వీధిచివర నున్న పెద్దమేడమీద నుంచి చటుక్కున ఎవరో మిలటరీ వస్తోందని చప్పట్లు చరిచారు.

వాళ్ళంతా పరుగెత్తారు. అది ప్రాణాన్ని కాపాడుకోవాల్సిన సమయం. వాళ్లు అన్నివైపులకూపరుగెత్తిప్రాణాన్ని కాపాడు కోటానికి ప్రయత్నించారు. ప్రక్కనున్నచోట్లకు—ఎక్కడతలుపులు తెరచిఉంటే అక్కడకు పారిపోయారు. యమునప్రసాద్ ఆ ము సి లి వా డి ని తప్పించుకుని ఎత్తుకుని హృషీకేశబాబు ఇంట్లో దూరపడ్డాడు.

మెషిన్ గన్స్ మ్రోగసాగాయి. మిలిటరీవాళ్ళు ట్రక్కుల్లోంచి క్రిందికిదిగారు. వాళ్ళు వీధిలో గస్తీతిరగసాగారు. అంతా నిస్తబ్ధంగా నిశ్శబ్దంగా ఉంది. కాని ఆ నిశ్శబ్దతను వాళ్ళ బూట్లచప్పుడు భేదిస్తోంది.

అది ఒకవిధమైన నిశ్శబ్దత. తలుపు సందుల్లోంచి కాని, కిటికీల్లోంచి కాని బైటికి చూడాలన్నా అంతా భయపడసాగారు. ప్రతిఒకరి దృష్టిలోనూ ఏదో తెలియనిబాధా భయమూ ఆవహించాయి.

ఒక గంట అయాక.

నందు, యమునప్రసాద్‌లు ముందు బయటకు వచ్చారు. ఆ ముసిలివాడు వారికి తలుపు తెరచాడు. జనశూన్యంగా ఉన్న ఆ వీధిలోకి వచ్చేసరికి ఎండ కళ్ళకు పొడిచినట్లయింది. ఆ దృశ్యం మహాశ్మశానంలా శూన్యంలా ఉంది. వాళ్లు, వారి చూపులు ఎడమవైపుకు తిరగగానే ఒక్కసారి త్రుళ్ళిపడ్డారు.

ఏమిటది ? ఆగుర్రం రోడ్డుప్రక్కన పడివుంది. దాని తెల్లటి శరీరంమీద ఎడమకాలిదగ్గిర నల్లటిమచ్చ స్పష్టంగా కన్పిస్తూనేఉంది. కుడిచెవికి వెనకకూడా ఒకపెద్ద గాయంపడ్డది.

"మేరా సాహబ్" అని పిలిచాడు ముసలివాడు. సమాధానం రాలేదు. ఆ ముసలివాడికి సాహబ్ సమాధానం ఇవ్వకపోవటం ఇదే మొదటిసారి!

(పీపుల్స్ ఏజ్ నుంచి)

★